# మా బ్రతుకు లింతేనా ?

కూలి నాలి చేసుకునే వారి కడుపులు కొట్టేటట్టుగా మూడు రోజుల నుంచి కుంభ వృష్టిగా వాన పడుతోంది. రోజు కూలి చేసుకుంటే గాని గడవని జీవితాలు ఎన్నో ఉన్నాయి. బాగా వాన పడితే వారిని కూలికి పిలిచేదెవరు ? వారి కడుపులు నింపే దెవరు ? ఆకలితో అలమటించి, కుక్కి నులక మంచం మీద రొచ్చుకంపులో దోమల గుంపులో సగం చినిగిన గోనె సంచిలో కాళ్ళు ముడుచుకుని పడుకున్నా మరి కంటికి నిద్ర రాని జీవితాలు ఎన్నో ఉన్నాయి.

చీకటి గాఢాంధకారం. చెట్లన్నీ తల విరబోసుకున్న దెయ్యాల్లా ఉన్నాయి. చీకట్లో ప్రతీ వస్తువు భయంకరంగా కన బడుతోంది. వాన పడుతూనే ఉంది. అంతా నీటి మయం. వూరి చివర వాడలో చిన్న గుడిసెల సంగతి చెప్ప నవసరం లేదు.

బుచ్చిబాబు పడుకున్న పాకంతా నీటితో నిండి పోయింది. గుడిసె కన్నీ చిల్లులే, నీరు ధారలు కట్టి లోపలికి పడుతోంది. రంగమ్మ ఒకసారి నీటి ధారలకేసి చూసి నేలకేసి చూసింది. గుడిసెలో పాదాలు మునిగేనీరు. నీరు కారుతున్న ప్రాంతాల్లో పెట్టిన ముంతలు, సొట్ట గిన్నెలు అన్ని నీటిలో తేలిపోతున్నాయి.

"ఇంకా వాన పడితే గుడిసె మునిగిపోయేటట్టుందిరా" అంది బుచ్చి తల్లి దిగులుగా.

"ఏం భయం లేదమ్మా! వచ్చి మంచం మీద కూర్చో" అన్నాడు.

సగం విరిగిపోయిన తలుపు సందుల్లో నుండి బయటకి చూసి "ఒరే బుచ్చీ, బయట నీరు ఎక్కువవుతోందిరా. మనం కాస్త జాగ్రత్తగా ఉండాలి" అంటూ తాను కూడా వచ్చి కొడుకు పక్కనే కుక్కి నులక మంచం మీద కూర్చుంది. బుచ్చి చూరు లో దాచిన కాగితం తీసి పడవలు చేసి నీటిలో వేసి అవి నడుస్తుంటే చప్పట్లు కొట్టి నవ్వుతున్నాడు.

"తడవగానే అవి ముందు కెళ్ళలేక మునిగి పోతాయి. తమ జీవితాలు కూడా ఇంతే అనుకుంటూ నిట్టూర్పు విడిచింది రంగమ్మ. ఇంతలో పిడుగు పడిన పెద్ద చప్పుడు.

"బాబోయ్! పిడుగు పడిందమ్మా" అంటూ తల్లి దగ్గరగా చేరాడు బుచ్చి.

"భయపడకు బాబూ. ఎక్కడో దూరంగా పడింది" అంటూ ఎండిపోయి చీపురుపుల్లలా ఉన్న రెండు చేతులతో ఒక్కో లాక్కుని వాడి చెవులు మూసి పట్టుకుంది.

"అమ్మా! ఈ పూట తినడానికేమైనా ఉందా ? " అన్నాడు దిగులుగా బుచ్చి. తల్లి గుండె కరిగింది ఆ మాటలకు. ఇప్పటికి మూడు దినాల నుంచి కొడుక్కి సరిగా తిండిలేదు. పద్నాలు గేళ్ళ కొడుకు పదేళ్ళ వయసువాడిలా కూడా లేడు. ఆకలితో అంటుం

పోయిన కొడుకు పొట్టచూసి లోతుకుపోయిన ఆమె కళ్ళ నుంచి నీటి బొట్లు ఎండి పోయిన దవడల మీద పడకుండానే చిరిగిపోయిన పమిట కొంగుతో ఒత్తుకుంది. కొడుకు ఎక్కడ చూస్తాడోనని ఆమె దిగులు.

"ఈ పూటకి నూకల జావుంది బాబూ! ఉల్లి కారం కూడా చేశాను. రేపటికి వాన తగ్గకపోతే ఎలాగో ఏమో" అంది. ఆ మాటలంటూంటే ఆమె కంఠం వణికింది. మాటలు రాక జీర పోయింది. తల్లి మొహం కేసి చూసిన కొడుకు—'పో నీలే అమ్మా! ఈ పూట కుందిగా—రేపటికి వాన తగ్గిపోతుందిలే" అన్నాడు తల్లి బాధపడుతోందని గ్రహించి.

"అంతా మన అదృష్టం బాబూ" అంది.

"ఆకలేస్తోందమ్మా! తినేద్దామా?" అన్నాడు తినబోయే దాని కోసం లొట్టలేసుకుంటూ.

"దానికేం బాబూ అలాగే తిందాం" అంటూ మంచం మీంచి లేచి కొడిగట్టి పోతున్న కిరసనాయిలు బుడ్డి దీపం దగ్గర కెళ్ళింది. దీపం బుడ్డి కదిలించి చూసింది. కిరసనాయిలు అయి పోయినట్టుంది. మూలనున్న కిరసనాయిలు సీసా తీసి అందులో అడుగున ఉన్న మడ్డి కాస్త దీపం బుడ్డిలో పోసింది తిండి తినే వరకేనా వెలుగుతుందని కొడిగట్టిన భాగం చేత్తో నులిమి వత్తి పెద్దది చేసింది అగ్గిపెట్టెలో మూడే పుల్లలున్నాయి. పెట్టె రాసి కాస్త వేడి ఎక్కగానె మెల్లిగా గీసి ఎలాగో అలాగ మెల్లిగ దీపం వెలిగించి పగిలిన చిమ్నీ జాగ్రత్తగా పెట్టి చూరుకు తగిలించిన పూచకు వేళాడ గట్టింది. గాలికి దీపం వచ్చే ప్రాణం పోయే

ప్రాణంలా కదులుతోంది. ఆ గుడ్డి వెలుతురు పాకంతా ఆక్రమించు కుంటే కరెంటు దీపం వేయించుకున్నంత ఆనందం కలిగింది బుచ్చికి.

రంగమ్మ చేతులు కడుక్కొచ్చి ఉట్టి మీదున్న జావ గిన్నె తెచ్చి బడ్డీ మీదున్న రెండు గిన్నెల్లో సద్ది ఉల్లికారం వేసింది. కింద కూర్చొని తిండానికి లేదు. అందుకే ఒక గిన్నె మంచం మీదున్న కొడుకు చేతికి అందించింది. మట్టి కుండలో నీళ్ళు ప్లాస్టిక్ గ్లాసులో ముంచి ఆ పక్కనే పెట్టి తానుకూడా వచ్చి కూర్చుంది. కొడుకు ఆవురావు రంటూ జావ తింటూంటే కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

''బాబూ! కొంచెం జావ వెయ్యానా'' అంది. తల్లి గిన్నె లోకి ఒక్కసారి తొంగి చూసి ''ఇంక నాకు చాలమ్మా నువ్వు తిను'' అంటూ కాళీ అయిన చేతిలో గిన్నె మూలకు పెట్టి అందు లోనే చెయ్యి కడుక్కున్నాడు. జావతో సగం మాత్రమే నిండిన పొట్టతో నీళ్ళు తాగి మిగిలిన భాగం నింపి మంచం మీదికి ఒరిగి గోనెపట్ట మీదికి లాక్కున్నాడు. తినడం పూర్తి చేస్తున్న తల్లి చటుక్కున ఏదో గుర్తు కొచ్చి ఒక ముద్ద ఆపి లేచి వెళ్ళింది. మెల్లిగా తలుపు తీసి ''రాముడూ'' అంటూ పిలిచింది.

తోక ఆడించుకుంటూ పరిగెత్తి కొచ్చింది రాముడు. ఆ గిన్నెలోని జావ చూరుకిందున్న పెద్ద బండరాయి మీద పోసింది. తోకాడించు కుంటూ తింటూన్న కుక్కకేసి అప్యాయంగా చూస్తూ నిలబడింది రంగమ్మ. తినటం పూర్తి అయ్యాక కుక్క తోకాడిస్తూ రంగమ్మ దగ్గర కొచ్చి నిలబడింది. ''వెళ్ళి పడుకో రాముడూ'' అంటూ ఒళ్ళు రాసింది.

వెంటనే కుక్క చూరు కింద బండరాయి మీద పడుకుంది.

తలుపు వేసి వచ్చి గిన్నెలు మూలకు పెట్టి చెయ్యి కడుక్కొని వచ్చి కొడుకు పక్కన మంచం మీద పడుకుంది. ఒక పట్టాన నిద్ర రాలేదు. జావ తిన్నాక చలి మరింత ఎక్కువై నట్లనిపించింది. తాటి ఆకుల గుడిసెమీద పడిన వాన మరింత చప్పుడవుతూంది. మధ్యలో దూరంగా భయంకరమైన పిడుగుల శబ్దాలు, నక్కల,కుక్కల అరుపులు, వూరికి అరిష్టమనుకునే గుడ్లగూబల అరుపులు మరింత భయాన్ని కలిగిస్తున్నాయి. వాటి మధ్యలో కీచురాళ్ళ రొద భరించలేకుండా ఉంది. వాటికి తోడుగా తల్లి పాలు చాలని చంటి పిల్లల ఆక్రందనలు, అన్నం చాలక అలమటించే పిల్లల రోదనలు, మందులు లేక మంచంలో పడి ఉన్న రోగుల మూలుగులు, ఇదే కాబోలు నరకమంటే అను కుంది రంగమ్మ. నిద్ర రాని రంగమ్మ మనసు పరిపరి విధాల పోయింది.

రెండేళ్ళ నాడు భర్త పోయే వరకు తమ బతుకులు బాగానే ఉన్నాయి. ఒక్క పిల్ల ఒక్క పిల్లాడు. ఎంతో గారాబం గా పెంచుసున్నారు. పిల్ల పెళ్ళి ఎంతో వైభవంగా చేశారు. భర్త అనారోగ్యం లేకుండానే హఠాత్తుగా గుండెపోటుతో మరణిం చాడు. పిల్ల పెళ్ళికి చేసిన అప్పు తీరలేదు. అందుకే భర్త పోయిన తరవాత అప్పులకై ఇంటిని పశువులను వెండి బంగారాలను అమ్మి వేసింది. పన్నెండేళ్ళ కొడుకు, తను జీవించాలి. ఈ గుడిసెలోకి చేరింది. ఇంట్లో సామానంతా రెండేళ్ళ పొట్టలు పోషించుకోవడానికి అమ్మి వేసింది. ఇప్పుడే కొడుకు రిక్షాలాగటం నేర్చుకున్నాడు. వాడే ఇప్పుడు ఇంట యజమాని. నేడు ఒడ్డు

ఎంత కష్టపడుతున్నాడో, వెర్రినాగన్నా, బంతుల్లా ఉండే చేతులు ఎండుకాడల్లా అయిపోయాయి. ఎదురింటి మేడ మీద కుర్రాడు పీడితోటి వాడే--ఎంత మనిషి అయ్యాడో అనుకుంటూ కొడుకుని దగ్గరకు తీసుకుని బావురు మంది. అమాయకంగా నిద్ర పోతున్న బుచ్చికి ఇవేమి తెలియడం లేదు. కాస్సేపు యేడ్చాక వాన కురిసిన మేఘంలా మనస్సు తేలికైంది రంగమ్మకు. గదంతా చీకటిగా అనిపించిన రంగమ్మ తలెత్తి చూసింది. ఎప్పుడో కిరసనాయిలు బుడ్డి దీపం ఆరిపోయింది. ఆ అంధకారంలో కుక్కి మలక మంచంలో మెల్లిగా నిద్రలోకి జారుకుంది రంగమ్మ.

తూర్పున వెలుగు రేఖలు ఆక్రమిస్తున్నాయి. వాన కూడా వెలిసింది. గాలికి చెట్లు కదిలినప్పుడల్లా కురిసినప్పుడు పడి ఉన్న వాన చినుకులు తపతప నేలమీద పడుతున్నాయి. తల్లి కొడుకులు లేచి ముఖాలు కడుగుకున్నారు.

రాత్రి మిగిల్చిన నూకలు పొయ్యి మీద పెట్టి ఉడికించి రాత్రి దాచిన ఉల్లికారం వేసి కొడుకుకు పెట్టింది. కుండలో అడుగున రెండు ముద్దల జావ మిగిలింది మూతపెట్టి మూలకు పెట్టుకుంది తన కోసం. జావ తిని చెయ్యి మూతి కడుక్కుని గుడిసెలో తాడు మీదున్న పాత తువ్వాలుతో తుడుచుకుంటూ బుచ్చి—అమ్మా! నేవెళ్ళాలి ఇంక'' అంటూ ఆ తువ్వాలు భుజాన వేసుకున్నాడు. ఒక్కసారి కట్టుకున్న బట్టలు చూసుకున్నాడు. చిరిగిన మాసికల్లో గుడ్డలు వేసి కుట్టిన పొట్టి లాగు దంతకంటె పాతగిల్లి మాసిన చొక్కా—బుచ్చికే బాధనిపించింది. అత్రికి కూలి డబ్బులో బట్టల సబ్బు తెచ్చుకొని ఉతుక్కోవాలి. రాబ్బులు మిగిల్చి ఒక పాత లాగు చొక్కా కొనుక్కోవాలి అను

కుంటూ పాత పెట్టి గబగబా వెతికాడు. ఇంతకంటె మరో లాగు చొక్కా దొరుకుతాయేమోనని, అన్నీ ఇంతకంటే చిరిగినవే. విసుగ్గా పెట్టి మూతవేసి నిలబడ్డాడు వెళ్ళడానికి. దూరంగా నిలబడి చూస్తున్న రంగమ్మ హృదయం ద్రవించినది. నోటమాట రాక అలాగే నిలబడింది. కాస్త దుఃఖం దిగ మ్రింగి'' బాబూ! నేను బ్రతికుండగా నువ్విలాటి పనులు చేస్తూఉంటే చూస్తాననుకోలేదు. నీ తండ్రి బ్రకుంటే నువ్విలా ఉండే వాడివి కాదురా'' అంది.

''ఎందుకలా బాధ పడతావు. నాలాటి వారు ఎంతో మందున్నారు ఈ వూళ్ళో ఇంతకంటే కష్టాల్లో ఉన్నవాళ్ళున్నారు''.

''అది కాదు బాబూ! హాయిగా చదువుకోవలసిన వయసులో నీ జీవితం ఇలా సాగుతుందని'' అంటూ మొహం రెండు చేతులతో కప్పుకొని వెక్కి వెక్కి ఏడ్చింది.

''నువ్వూరికే బాధపడి ఆరోగ్యం పాడు చేసుకోకమ్మా' ఈవేళ రిక్షాకూలి వస్తే నీకు పండ్లు మందులు కొనుక్కొని వస్తానమ్మా అన్నాడు.

''సంపాదనతో పొట్టలే గడవటం కష్టంగా ఉంది. చావటానికి సిద్ధంగా ఉన్న నాకెందునురా అవన్నీను? అయినా ఆసుపత్రి మందులున్నాయిగా'' అంది విరక్తిగా.

''అమ్మా! ఆ గవర్నమెంటు ఆసుపత్రిలోని ఆ ఎర్ర నీళ్ళకు జబ్బులు నయం కావమ్మా? ఏం చేస్తాం! గతిలేక పోతే అవే మందులు, సాయంకాలం మంచి డాక్టరుకి చూపించి మందులు కొంటానమ్మా''

"దేనికిరా బాబు నువ్వింత కష్టపడి సంపాదిస్తుంటే నాకు మనశ్శాంతి ఎలా ఉంటుందిరా!"

"అమ్మా! ఈ మాట నువ్వలా అన్నావంటే నామీద ఒట్టే అప్పుడే బారెడు పొద్దెక్కిందమ్మా వస్తా" అంటూ గబగబా అడుగు లేసుకుంటూ రిక్షా కోసం వెళ్ళాడు బుచ్చి. కొడుకు వెళ్ళేవరకూ చూస్తూ నుంచుంది రంగమ్మ.

"వయసు చిన్నదైన మాటలు బాధ్యతగా మాటాడుతాడు వెర్రినాగన్న" అంటు ఇంటికిముందు వెనుక భాగాలు ఆ బురద లోనె కాస్త వూడ్చి ముగ్గేసింది. రెండు చెంబులు నీళ్ళు పోసుకొచ్చి దేవుని ఫోటోకి నమస్కరించింది. గిన్నెలో మిగిలి ఉన్న జావ తాగుతుంటే రాముడు తోకాడించుకుంటూ వచ్చి నిలబడింది. బక్క చిక్కిన ఆ కుక్కని చూస్తే జాలేసింది రంగమ్మకు.

"ఈ పట్నాలలో కుక్కల బ్రతుకులు మరీ దుర్భరమై పోయయి. ఎవరూ ఆకులలో తినడమే మానేశారు. కంచాల్లో తిని మిగిలిన మెతుకులు మోరీల్లో పోసేస్తున్నారు. పాపం ఎంగిలి మెతుకులకే మొహం వాచిపోయాయి ఈ కుక్కలు" అను కుంటూ కుండలో మిగిలిన జావ చూరు కిందన పెద్ద బండమీద పోసింది. తోకాడించుకుంటూ నాకేసింది రాముడు.

సాయంకాలం నాలుగు గంటల కల్లా రిక్షా అప్పజెప్పి మూడు రూపాయలు యజమాని చేతిలో పెట్టాలి బుచ్చి. అప్పటికే జేబులో ఆరు రూపాయలు గలగల మంటున్నాయి. రెండుసార్లు లెక్కపెట్టుకుని ముందు వెనక మార్చి చూసుకున్నాడు. క్రొత్త పాంటు షర్టు కుట్టించు కున్నంత సంబరపడ్డాడు. కొత్త

సైకిలు కొనుక్కున్నంత సంబరం వచ్చింది బుచ్చికి. ఎక్కడ లేని ఉత్సాహంతో రిక్షా లాకుంటూ ఇల్లు చేరుకుని తల్లి చేతిలో పెట్టాడు డబ్బు.

తల్లి దృష్టి అంతగా ఆనందపడుతున్న కొడుకు మీద లేదు. వాడిపోయిన అతని ముఖం మీద, లోతుకు పోయిన అతని కళ్ళమీద! చెరిగిపోయిన అతని జుట్టు మీద అంటుకు పోయిన ఆతని పొట్ట మీద పడి కొట్టుకుంటోంది. కొడుకు చేతులు పట్టుకు చూసింది. చేతినిండా బొబ్బలే, ఆ రెండు చేతులు గుండెలకు హత్తుకుపి బావురు మంది. అదేమిటమ్మా! ఎంతో సంబరంగా నేను ఇంటికి వస్తే ఏడుస్తావెందుకు నువ్వేడవ కమ్మా!'' అంటూ తల్లి ఒడిలో వాలిపోయి ''అమ్మా ఆకలేస్తూంది'' అన్నారు.

''నామతిపోను. అసలు సంగతి మర్చే పోయాను'' అంటూ పొయ్యంటించి టీకి నీళ్ళు పడేసింది ''బుచ్చి! ఇదిగో ఈ రూపాయి పట్టుకెళ్ళి ఒక టీ పొట్లాం, ఒక చెటాకు చక్కెర పట్టుకురా, నేవెళ్ళి పాలు తెస్తాను.''అంది

టీ అనగానే మొహం ఇంత చేసుకుని తూనీగల పరుగెత్తి కెళ్ళి పట్టుకొచ్చి పొయ్యి పక్కన పెట్టి పక్కనే ఒక పీటేసు కూర్చున్నాడు. తల్లి కలిపిచ్చిన టీ తాగుతూ ''బాగుందమ్మా టీ'' అన్నాడు.

"నా తండ్రీ! రోజు కాస్త కలిపిస్తాలే చక్కర విడిగా దొరుకుతూందిగా రేషన్ తీసేశాక" అంది టీ తాగిన కప్పు పక్కన పెట్టి.

"రిక్షా ఇచ్చొస్తానమ్మా" అన్నాడు. కొంగులో దాచిన మూడు రూపాయలు కొడుకు చేతిలో పెట్టి మిగిలిన రెండూ రూపాయలతో బియ్యం ఆవీ తెచ్చుకొచ్చి అన్నం వండుతాను త్వరగా వచ్చేసెయ్యి'' అంది.

ఇంతలో పక్కింటి రాంబాబు రిక్షా లాకుంటూ వచ్చి "ఒరేయి బుచ్చి! మనం ఈ పూట కూడా రిక్షా లాగుందాంరా. ఈవేళ గిరాకీ బాగుంది. రాత్రి ఏడు గంటల కల్లా అప్పచెప్పేద్దాం. ఫస్టు షో కెళ్ళే రద్దీ బాగుంటుంది'' అన్నాడు.

"సరే అయితే! రిక్షా యజమానితో చెప్పి పోదాం'' అంటూ బయలుదేరా రిద్దరు.

ఏడు గంటల వరకు రిక్షాలు తొక్కుతూనే ఉన్నారు. మళ్ళీ ఆరు రూపాయలు వచ్చాయి. ఎంతో ఉత్సాహంగా బుచ్చి ఇంటి ముఖం పట్టాడు. చల్లగాలికి జోరుగా వస్తోంది రిక్షా. ఛాదర్‌ఘాట్ బ్రిడ్జి ఎక్కేడు. అంత అమాంతం యమధర్మరాజులా పోలీసొచ్చి రిక్షా పట్టుకు ఆపాడు. అర్థం కాని బుచ్చి తెల్లబోయాడు లైటులేకుండా ఎక్కడికెడుతున్నావురా రాస్కెల్'' అంటూ చెంపన ఒక్కటంటించాడు పోలీసు పెద్ద ఘన కార్యం చేసినట్లు ఫోజు పెట్టి. బుచ్చి కళ్ళలో నీళ్ళు సుడి గుండాల్లా తిరిగాయి. "మళ్ళి ఒక్కటిస్తే పోలీసుని ఏమవుతుంది'' అనుకుని ఎత్తబోయిన చెయ్యి చెంప మీదికి పోయి దెబ్బను తడిమి తడిమి చూసుకుంది. రిక్షా పట్టుకుని బ్రిడ్జి ప్రక్కకు తీసుకెళ్ళాడు పోలీసు. అక్కడ ఎన్నో లారీలు, సైకిళ్ళు, రిక్షాలు ఉన్నాయి.

అన్నీ ఇలాగే పట్టుకున్నట్టున్నారు. అందరూ తన లాటి అమాయకులు, దురదృష్ట వంతులేనేమో అనుకున్నాడు. ఏం చెయ్యడానికి తోచలేదు. ఇంతలో ఒక లారీ డ్రైవరు దగ్గరగా వచ్చి ''కేసు బుక్ చెయ్యకుండానే ఓ రెండు రూపాయలు చేతిలో పెట్టు బాబు'' అన్నాడు. ఇంతలో ఇంకో రిక్షా పట్టుకోడానికి వెళ్ళిన పోలీసు తిరిగొచ్చి ''ఏరా రాస్కెల్ లైట్ లేకుండా పోతున్నావు రోడ్డు మీద నీ ఇల్లనుకున్నావేమిటిరా'' అన్నాడు.

''లేదు సార్'' అంటూ రెండు రూపాయలు పోలీసు చేతిలో పెట్టి—

"మా అమ్మకి జబ్బుగా ఉంది సార్! నేను అర్జంటుగా ఇంటికెళ్ళాలి, నన్ను వదలండి సార్ మీ కాళ్ళు మొక్కుతాను'' అంటూ రెండు చేతులెత్తి నమస్కరించాడు. ఇంతలో డ్రైవరు తాను ఇవ్వవలసిన 25 రూ. చేతిలో పెట్టేటప్పడికి చేటంత మొహం చేసుకున్న పోలీషు, ''పోరావెధవ'' అంటూ చేతికర్రతో బెదిరించాడు. చావు తప్పి కన్ను లొట్టయినట్లయింది బుచ్చికి. స్పీడుగా రిక్షా తొక్కుకుంటూ బ్రిడ్జి ఇవతలకు వచ్చి ఒకసారి వెనక్కి తిరిగి చూసుకున్నాడు. అనుభవం లేక లైటుందో లేదో కూడా చూసుకోలేదు అంటూ తన్నితానే తిట్టుకుంటూ యజమానికి ఇవ్వవలసిన రెండు రూపాయలు రిక్షా అప్ప చెప్పి మిగిలిన రెండు రూపాయలతో ఇల్లు చేరుకున్నాడు.

దిగాలుగా వచ్చిన కొడుకును చూసి "ఏం జరిగింది బాబు" అంది. జరిగినదంతా విని ఎంతో బాధపడింది—

"పోనిలే బాబు ఏం చేస్తాం, మనికి ఇంతే ప్రాప్తముంది" అంది.

"లేదమ్మా ఈ రెండు రూపాయలతో కట్టెలు కిరసనాయిలు మిరపకాయలు, కూరలు, ఎన్నని కొనాలమ్మా. చెప్పు సంపాదించిన డబ్బు సగం పోయింది" అన్నాడు బెంగగా.

ఒక్కపూట కడుపునిండా తింటే పొద్దుటికి తిండి ఉండదు. అందుకే సంపాదించినా అర్ధాకలే తీర్చుకున్నారు ఆ తల్లీ కొడుకులు. చాలీచాలని గోనె పట్టా కప్పుకొని కాళ్లు ముడుచుకుని నులక మంచంలో ఒరిగారు. అర్ధకలితో అలమటించే పిల్లల ఏడుపులు మామూలే. అర్ధరాత్రి ఆకలితో పెద్ద బండరాయి మీద పడుకున్న కుక్క నిద్రరాక అరచింది.

"మా బ్రతుకులింతేనా" అంటూ మికిలిన కుక్కలు శ్రుతి కలిపాయి. మా బ్రతుకులూ ఇంతే అంటూ నులక మంచం మీద నిద్రరాని రంగమ్మ నిట్టూర్పు విడిచింది. బలవంతగా కళ్ళు మూసుకుంది. కష్టాలన్నీ విడవకుండా కౌగలించుకుంటూంటే నిద్ర మాత్రం దూరంగా నిలబడి చూస్తూంది ఆ జీవుల్ని,

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక)